సాక్షి
ఆదిలాబాద్
మంగళవారం । 18 । జూలై । 2023



పంచాయతీ కార్మికుల నిరసన
తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు. పలు చోట్ల రాస్తారోకోలు నిర్వహించారు. 9లో▸



జన ఔషధికి.. 'సహకారం'
ఇక గ్రామాల్లోనూ జనరిక్ మెడిసిన్ అందుబాటులోకి రానుంది. పీఏసీఎస్‌ల ద్వారా ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాపుల ఏర్పాటుకు కేంద్రం యోచిస్తోంది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
27.0/24.0
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



మాట్లాడుతున్న పూసం సచిన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా ప్రభుత్వం హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. సోమవారం రిమ్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సీజనల్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రిమ్స్‌లో ఓపీ పెరగడంతో గంటల తరబడి నిలబడాల్సి వస్తోందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకే సేవలు నిలిపివేయడంతో ఇక్కట్లు పడుతున్నారని తెలిపారు. సాయంత్రం వరకు ఓపీ సేవలు కొనసాగించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా వైద్యులను నియమించాలని డిమాండ్ చేశారు.

ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఒప్పందం ప్రకారం వేతనాలు చెల్లించాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చందు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు రిమ్స్‌లోని కృష్ణ కన్‌స్ట్రక్షన్స్ ఏజెన్సీ సూపర్‌వైజర్ వేణును సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. డీఎంఈ సర్క్యులర్, అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. లేకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇందులో సంఘం నాయకులు ముజీబ్, ఇక్బాల్ తదితరులు ఉన్నారు.

గడువులోపు 'సమీకృత' పనులు పూర్తి



పనులను పరిశీలిస్తున్న ప్రేమేందర్

కైలాస్‌నగర్: సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు గడువు లోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీకి ఆనుకుని 18 ఎకరాల్లో నిర్మిస్తున్న కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్ని శాఖల కార్యాలయాలు ఒకే చోట కేంద్రీకృతమై ఉండేలా సమీకృత కలెక్టరేట్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఐటీ టవర్ సైతం ఇదే ప్రాంతంలో నిర్మాణం కానుందని పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె



నినాదాలు చేస్తున్న కార్మికులు

కైలాస్‌నగర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె ఆపేది లేదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి కుంటాల రాములు స్పష్టం చేశారు. సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె సోమవారంతో 17వ రోజుకు చేరింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్ష శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. కార్మికుల సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. 17 నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ బిల్లులతో పాటు వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం నాయకులు రాంబాయి, పుష్ప, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా గౌడజన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంగు నాగరాజ్ గౌడ్, సంతోశ్ గౌడ్ ప్రకటనలో కోరారు. పట్టణంలోని న్యూ హౌసింగ్‌బోర్డు కాలనీలో మాల సంక్షేమ సంఘం భవనంలో ఈనెల 18న మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గౌడ కులస్తులు, గీత కార్మికులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రి ఓపీ విభాగం సోమవారం ఇలా రోగులతో కిక్కిరిసి కనిపించింది. దాదాపు 1500 మంది వరకు రావడంతో ఆస్పత్రిలోని హాల్ నిండి బయట వరకు క్యూ కట్టారు. పేరు నమోదుకు గంటల తరబడి బారులు తీరాల్సి పరిస్థితి. రెండు, మూడు రోజులుగా ఓపీ విభాగానికి రోగుల తాకిడి పెరిగింది. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ఆస్పత్రి ఇలా కిటకిటలాడుతోంది.

ఫీవర్‌..

- జిల్లాలో విజృంభిస్తున్న విష జ్వరాలు
- సీజనల్ వ్యాధులతో జనం ఇబ్బందులు
- రోగులతో ఆస్పత్రులు కిటకిట

జిల్లాలో ఈ ఏడాది నమోదైన..
డెంగీ కేసులు : 23 (ఈ నెలలో 05)
సాధారణ జ్వరాలు :6,500
మలేరియా కేసులు :02

ఆదిలాబాద్‌టౌన్: వాతావరణ మార్పులతో జిల్లాలో ఒక్కసారిగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. కురుస్తున్న వర్షాల కారణంగా ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల్లో జనం సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా, వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. దీంతో దోమలువృద్ధి చెందుతున్నాయి. ఈ ప్రభావం ప్రజారోగ్యంపై పడింది. దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిక్కిరిసి పోతున్నా యి. రానున్న రోజుల్లో మరింతగా పెరిగే అవకాశాలు ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రి ఓపీ విభాగం రోగులతో కిటకిటలాడింది. పేరు నమోదుకు జనం బారులు తీరారు. దాదాపు 1500 మంది వరకు వైద్యం కోసం తరలివచ్చారు. అయితే ఇందులో దాదాపు వెయ్యి మంది వరకు దగ్గు, జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులతో వచ్చినవారే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

పెరుగుతున్న డెంగీ కేసులు..
పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా జ్వరాలు ప్రబలుతున్నాయి. ఈనెలలో కురిసిన వర్షాల కారణంగా ఒక్కసారిగా డెంగీ కేసులు పెరిగాయి. జనవరి నుంచి ఇప్పటివరకు 23 నమోదవగా, ఇందులో ఈనెలలోనే 5 నమోదైనట్లు వైద్యులు తెలిపారు. జిల్లాకేంద్రంలోని కేఆర్‌కే కాలనీ, చిల్కూరి లక్ష్మీనగర్‌తో పాటు ఇచ్చోడ, గుడిహత్నూర్, ఇంద్రవెల్లిలో డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. మలేరియా కేసులు ఈఏడాది 2 నమోదు కాగా, తాంసిలో 1, నర్సాపూర్(టి)లో మరో కేసు నమోదైనట్లు పేర్కొన్నారు. సాధారణ జ్వరాలు ఈనెలలో వెయ్యికి పైగా నమోదయ్యాయి.

రోగులతో కిటకిట..
జిల్లా కేంద్రంలోని రిమ్స్‌తో పాటు ఉట్నూర్, బోథ్ ఏరియా ఆస్పత్రులు, ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,అర్బన్‌హెల్త్‌సెంటర్లు, జిల్లాకేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులు రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలోని ఉట్నూర్, నార్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ మండలాల్లో జ్వరాల కేసులు అధికంగా ఉన్నాయి. చాలా మంది ఆస్పత్రులకు వెళ్లలేక మంచం బారిన పడుతున్నారు. కాగా మార్చిలో సాధారణ జ్వరాలు 1617,ఏప్రిల్‌లో 1558, మేలో 1628, జూన్‌లో 1571, జూలైలో ఇప్పటివరకు వెయ్యికి పైగా కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.

బ్రీడింగ్ చెక్కర్ల నియామకం..
సీజనల్ వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. జిల్లాలో 25 మంది బ్రీడింగ్ చెక్కర్లను నియమించింది. డిసెంబర్ వరకు వీరిని కొనసాగించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఒక్కో బ్రీడింగ్ చెక్కర్ రోజుకు వంద ఇళ్ల చొప్పున సర్వే చేస్తారు. వ్యాధులపై అవగాహన కల్పిస్తారు. డెంగీ జ్వరాలు ప్రబలిన చోట స్ప్రే చేయిస్తారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించే విధంగా చర్యలు చేపడతారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్లు, పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. డ్రమ్ములు, పాత టైర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే అందులో దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా ప్రబలుతాయి. వారంలో రెండు రోజులు డ్రైడే పాటించాలి. ఏజెన్సీ ప్రాంతాల్లో ర్యాపిడ్ సర్వే చేయిస్తున్నాం. బ్రీడ్ చెక్కర్లను నియమించాం. ఆస్పత్రుల్లో సరిపడా మందులను అందుబాటులో ఉంచాం.
– నరేందర్ రాథోడ్, డీఎంహెచ్‌వో

ప్రత్యేక దృష్టి..
వ్యాధులు ప్రబలుతుండడంతో వైద్యశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సరిపడా మందులను అందుబాటులో ఉంచారు. కలెక్టర్ సమక్షంలో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కళాజాత బృందాలతో గోండీ భాషలో అవగాహన కల్పిస్తున్నారు. ఇంద్రవెల్లి, దంతన్‌పల్లి, గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్ మండల వాసుల కోసం ప్రత్యేకంగా ఐదు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. 16 ట్రైబల్ పీహెచ్‌సీల్లో ప్రతిరోజు ర్యాపిడ్ సర్వే చేపడుతున్నారు. మైదాన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. పల్లె దవాఖానాల్లో మందులు, 14 రకాల టెస్టులు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. హైరిస్క్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొంటున్నారు.

లక్ష సాయం.. నిరంతర ప్రక్రియ

- లబ్ధిదారుల జాబితాలు సిద్ధం
- మంత్రి ఆమోదమే తరువాయి
- నియోజకవర్గానికి 300 చొప్పన..
- ఈనెల 25లోగా తొలివిడత సాయం
- ఇకపై ప్రతినెలా 5 నుంచి 15వ తేదీ వరకు ప్రక్రియ



జిల్లాలో ఆర్థిక సాయం ఇలా..	
ఎంపిక చేసిన బీసీ కులవృత్తులు	15
వచ్చిన దరఖాస్తులు	11,721
పరిశీలన పూర్తయినవి	6,136

సాక్షి,ఆదిలాబాద్: కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మాదిరిగానే బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం కూడా నిరంతర ప్రక్రియలా కొనసాగనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఈ పథకాన్ని శనివారం ప్రారంభించారు. జిల్లాలో మొదటి విడత ఆర్థిక సాయంను ఈనెల 25లోగా అందించాలని నిర్ణయించారు. తొలివిడతలో నియోజకవర్గానికి 300 మంది చొప్పున అందించనున్నారు. ఇప్పటికే ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గానికి సంబంధించిన జాబితా రూపొందించారు. దీనిపై మంత్రి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. ప్రతినెలా 5వ తేది నుంచి 15వ తేదీలోగా ఈ సహాయ ప్రక్రియ కొనసాగనుంది. నిధులు అందుబాటులో ఉన్నప్పుడు అర్హులకు సాయం అందించేలా ఈ ప్రాసెస్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..
బీసీ కులవృత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయానికి సంబంధించి ప్రభుత్వం జూన్ 6 నుంచి 20వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతో పాటు పాక్షికంగా జిల్లా పరిధిలోకి వచ్చే ఖానాపూర్, కుమురంభీం ఆసిఫాబాద్ పరిధిలోని మండలాల నుంచి వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని మండలాల్లో ఎంపీడీవోలు, పట్టణంలో మున్సిపల్ కమిషనర్ పరిశీలన చేసి బీసీ కార్పొరేషన్ ఈడీ లాగిన్‌కు పంపారు. ఈడీ నుంచి హైదరాబాద్‌లోని బీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ (ఎండీ)కి పంపగా, అక్కడినుంచి గడిచిన శుక్రవారం మెరిట్ లిస్ట్ జిల్లా అధికారికి వచ్చింది. దీనిపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నుంచి ఆమోదం తీసుకోవాల్సి ఉంది. ఆ తర్వాత కలెక్టర్ ద్వారా పాలన ఆమోదం అనంతరం తిరిగి ఎంపీడీవో, కమిషనర్‌కు మెరిట్ లిస్ట్ వెళుతుంది. దాని ఆధారంగా క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ పంపిణీ చేపడుతారు.

విధానం ఇలా..
రూ.లక్ష ఆర్థిక సాయం పొందిన లబ్ధిదారు మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదు. అయితే క్షేత్రస్థాయిలో రెండేళ్ల పాటు యూనిట్ తప్పనిసరిగా నడపాలి. ఈమేరకు పరిశీలన కోసం మండల స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లను ప్రభుత్వం నియమించింది. వారు ప్రతి మూడు నెలలకోసారి ఫీల్డ్ లెవల్‌లో వెరిఫై చేసి ఆ రిపోర్టును ప్రభుత్వానికి పంపిస్తారు.

ఇతర బీసీలు కూడా దరఖాస్తు చేసుకున్నారు



ఇతర బీసీలు కూడా ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మొదట 15 కులవృత్తుల వారికి సాయం అందజేసిన తర్వాత వారికి కూడా సాయం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 18లోగా పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ప్రక్రియ చేపడతాం. – రాజలింగు, ఈడీ, బీసీ కార్పొరేషన్, ఆదిలాబాద్

రాష్ట్రంలో దోపిడీ దొంగల రాజ్యం

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఇచ్చోడ సభలో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

ఇచ్చోడ: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో దోపిడీ దొంగల రాజ్యం కొనసాగుతుందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన బహుజన ఆత్మగౌరవ సభలో పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో దుర్మార్గాపు ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలంతా బీఎస్పీ వెంట రావాలని కోరారు. ఆంధ్ర పెత్తందారుల వల్ల తెలంగాణకు అన్యాయం జరిగిందన్న ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం ఆంధ్ర ప్రాంత బడా కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి పర్సెంటేజీల ద్వారా రూ.వేల కోట్లు దండుకుంటున్నాడని ఆరోపించారు. ఈ ఎన్నికలో తాను సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి పోటీ చేయనున్నట్లు తెలిపారు. సమవేశంలో రాష్ట్ర కార్యదర్శి సిడాం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో పార్టీ కార్యాలయం ప్రారంభం
ఇంద్రవెల్లి: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బీఎస్పీ కార్యాలయాన్ని ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. పేదలకు అభివృద్ధి ఫలాలు దక్కాలంటే రాష్ట్రంలో బీఎస్పీ అధికారంలోకి రావాలన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జీపీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఇంద్రవెల్లి అమవీరుల స్థూపాన్ని సందర్శించి నివాళులర్పించారు. అక్కడ నుంచి కేస్లాపూర్ నాగోబా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆయన వెంట పార్టీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, అధ్యక్షులు బన్సీలాల్, రాజేశ్, నాయకులు సంతోష్, అంకుష్, తదితరులున్నారు.

శ్యాంపూర్‌లో..
ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండలంలోని శ్యాంపూర్‌లో అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, అన్న బావుసాటే విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. మహనీయుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయం

- ఎమ్మెల్యే జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్‌రూరల్: రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా మావల మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా ట్రాక్టర్లతో చేపట్టిన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతు బాగుపడితే సమాజం బాగుపడుతుందన్న ఉద్దేశంతో సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతకు అన్నివిధాలా అండగా నిలుస్తోందన్నారు. నాడు కాంగ్రెస్ హయాంలో రైతు ల సమస్యలు పరిష్కరించడంలో ఆ పార్టీ పూర్తిగా విఫలమయిందన్నారు. మూడు గంటల విద్యుత్ ఇస్తామంటున్న కాంగ్రెస్, మోటార్లకు మీటర్లు పెడతామన్న బీజేపీ అన్నదాతపై కక్ష సాధించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందులో డీసీసీబీ చైర్మన్ అడ్డి భో జారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, జెడ్పీటీసీ వనిత రాజేశ్వర్, సర్పంచ్ ప్రమీల రాజేశ్వర్, ఎంపీపీ సంగీత, నాయకులు ప్రహ్లాద్, నారాయణ పాల్గొన్నారు.

'రేవంత్ క్షమాపణలు చెప్పకపోవడం సిగ్గుచేటు'
జైనథ్: సాగుకు కేవలం మూడు గంటల విద్యుత్ మాత్రమే చాలంటూ రైతాంగాన్ని కించపర్చిన రేవంత్ రెడ్డి ఇంకా రైతులకు క్షమాపణలు చెప్పకపోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే రామన్న అన్నారు. మండలంలోని సిర్సన్న గ్రామంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు మళ్లీ కష్టాలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, నాయకులు వెంకట్‌రెడ్డి, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొలిక్కి వచ్చేనా..?

- 353బీ ఎన్‌హెచ్ నిర్మాణానికి ఆటంకాలు
- బేల వద్ద బైపాస్ కోసం భూసేకరణ
- సర్వేకు ఒప్పుకోని రైతులు
- ఇప్పటికే టెండర్ నోటిఫికేషన్ జారీ.. ఈనెల 31తో ప్రక్రియ పూర్తి





ఇక్కడ కనిపిస్తున్న రైతు రాంబడే శ్యామ్‌రావు. బేల మండలం మొహబత్‌పూర్ శివారులో ఈయనకు నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బేల వద్ద బైపాస్ నిర్మిస్తుండగా ఇందుకోసం అధికారులు భూసేకరణ చేపట్టాలని భావించారు. శ్యామ్‌రావు రెండెకరాల భూమి సేకరించాల్సి ఉండగా, ఆయన ఒప్పుకోవడం లేదు. ఇతడిలాగే పలువురు రైతులు భూమి ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు.

రోడ్డు వివరాలు
రహదారి : ఎన్‌హెచ్ 353బీ
జిల్లాలో కిలోమీటర్లు : 33 (బేల, జైనథ్ మీదుగా భోరజ్ వరకు)
అంచనా వ్యయం : రూ.490 కోట్లు (భూ సేకరణకు కలిపి)
విస్తరణ ఇలా : ఏడు మీటర్ల నుంచి 10 మీటర్లకు పెంపు

రోడ్డు స్వరూపం ఇలా
● బేల వద్ద బైపాస్ నిర్మాణం
● తరోడా గ్రామం వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం
● తరోడా, జైనథ్, బెల్గాం వద్ద సర్వీసు రోడ్ల నిర్మాణం
● భోరజ్ వద్ద మరో వెహికిల్ అండర్ పాస్ (వీయూపీ) నిర్మాణం

సాక్షి,ఆదిలాబాద్: మహారాష్ట్ర నుంచి బేల, జైనథ్ మీదుగా భోరజ్ వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి '353 బీ' నిర్మాణానికి ఆటంకం ఎదురవుతుంది. బేల వద్ద బైపాస్ నిర్మాణం కోసం భూ సేకరణ చేయాల్సి ఉండగా, రైతులు వ్యవసాయ భూములు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో భూసర్వే చేపట్టాలనుకున్న అధికారులకు ప్రక్రియ ముందుకు సాగడం లేదు. సర్వే పూర్తయితేనే పరిహారం ఎంత ఇస్తారనేది ప్రభుత్వం నిర్ణయిస్తుంది. రైతులతో బేలలో అధికారులు సోమవారం సమావేశమైనప్పటికీ సమస్య కొలిక్కి రాలేదు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ మొదలైంది. ఈనెల 31న కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకునేందుకు చివరి గడువు. భూసేకరణ కొలిక్కి వస్తేనే ముందడుగు పడే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే బేల, జైనథ్‌లలో 56 ఎకరాలు ఈ రోడ్డు విస్తరణ కోసం సేకరించాల్సి ఉంది. అందులో బేల బైపాస్ వద్దనే అధికంగా సుమారు 40 ఎకరాల వరకు వస్తుంది.

విస్తరణతో పాటు పటిష్టం..
ప్రస్తుతం ఈ రోడ్డు ఏడు మీటర్ల వెడల్పు ఉండగా, దాన్ని 10 మీటర్లకు విస్తరించి హైవే నిబంధనలకు అనుగుణంగా పటిష్టం చేయనున్నారు. మహారాష్ట్రలోని ఆష్టి నుంచి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వరకు ఈ ఎన్‌హెచ్‌ను నిర్మిస్తున్నారు. అక్కడి నుంచి ఇక్కడి వరకు 141 కిలో మీటర్లు ఉండగా జిల్లాలో 33 కిలో మీటర్లు మాత్రమే వస్తుంది. మహారాష్ట్ర ప్రాంతంలో ఎన్‌హెచ్‌ఏఐ నిర్మాణం చేపట్టనుండగా, తెలంగాణలో ఎన్‌హెచ్ నిర్మిస్తుంది. భారతమాల కింద ఈ జాతీయ రహదారికి అంకురార్పణ జరిగింది. కేంద్ర ప్రభుత్వ నిధులతో దీన్ని నిర్మించనున్నారు. రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఎన్‌హెచ్‌కు దీని అమలు బాధ్యత అప్పగించారు. ఎన్‌హెచ్ చీఫ్ ఇంజినీర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పూర్తి కానుంది.

వాహన రద్దీ తక్కువ రావడంతో..
రెండేళ్ల క్రితం అంతర్రాష్ట్ర రహదారిగా ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ రోడ్డును జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేశారు. ఆ తర్వాత ఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రిత్వ నుంచి ఈ రోడ్డు ట్రాఫిక్‌కు సంబంధించి సర్వే చేపట్టారు. ప్యాసింజర్ కార్ యూనిట్ (పీసీయూ) సర్వేలో భాగంగా ఈ మార్గం మీదుగా ప్రతి రోజు వెళ్లే వాహనాల సంఖ్య లెక్కించారు. అన్ని రకాల వాహనాలు కలిపి 10 వేలకు పైగా వస్తే ఈ రహదారిని ఫోర్‌లేన్‌గా మార్చేందుకు అర్హత సాధించేది. అయితే ఇక్కడ పీసీయూ 8వేలు మాత్రమే వచ్చింది. దీంతో ప్రస్తుతం ఉన్న డబుల్ లేన్‌నే హైవే నిబంధనలు అనుసరించి పేవుడ్ షోల్డర్ పద్ధతిలో పటిష్ట పర్చనున్నారు. అందులో భాగంగా డబుల్ లేన్‌నే మరికొంత విస్తరించడం, వంపులు, మలుపులను సరిచేస్తూ అవసరమైన చోట సర్వీసు రోడ్లను నిర్మించడం, బ్రిడ్జిల నిర్మాణం చేపట్టడం వంటివి చేస్తారు.

భారీ ఎన్‌హెచ్‌లతో అనుసంధానం
మహారాష్ట్రలోని ఆష్టి నుంచి తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వరకు నిర్మిస్తున్న 353బీ జాతీయ రహదారి అటువైపు ఇటువైపు దేశంలోని పెద్ద జాతీయ రహదారులకు అప్రోచ్‌గా నిలుస్తోంది. ఆదిలాబాద్ జిల్లా భోరజ్ వద్ద ఈ రహదారిపై నుంచి ఎన్‌హెచ్ 44కు అప్రోచ్‌గా నిలుస్తోంది. మహారాష్ట్రలోని ఆష్టి వద్ద 353సి ఎన్‌హెచ్‌కు కలుస్తోంది. ఈ రహదారి పైనుంచి వెళ్లే మార్గంలో సకోలి ఎన్‌హెచ్ 53 కలుపుతుంది. ఎన్‌హెచ్ 44 దేశంలో ఉత్తర, దక్షిణ భూభాగాన్ని కలుపుతుంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4,112 కిలోమీటర్లు విస్తరించి ఉంది. ఇక 1795 కిలోమీటర్లు విస్తరించి ఉన్న ఎన్‌హెచ్ 53 ద్వారా గుజరాత్, మహారాష్ట్ర, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలకు ప్రయాణించవచ్చు. భోరజ్ నుంచి ఆష్టికి వెళ్లే క్రమంలో మధ్యలో రాజురా వద్ద 930డీ ఎన్‌హెచ్ కూడా దీనికి కలుస్తుండటం గమనార్హం. తద్వారా 353బి జాతీయ రహదారి ఇరువైపులా అనేక జాతీయ రహదారులను కలపడం ద్వారా దేశంలోని అనేక రాష్ట్రాలకు వెళ్లేందుకు అనువుగా ఉండనుంది.

బైపాస్ కోసం సాగు భూములివ్వం



డీఎస్పీ ఉపేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

బేల: బేల బైపాస్‌కు సంబంధించిన భూ నిర్వాసితులతో డీఎస్పీ ఉమేందర్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో సమావేశమయ్యారు. బైపాస్ సర్వే కోసం రైతులు సహకరించాలన్నారు. అయితే ఎట్టి పరిస్థితుల్లో తమ సాగు భూములు ఇవ్వమని 25మంది రైతులు స్పష్టం చేసి వినతిపత్రం అందజేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని డీఎస్పీ తెలిపారు.

రైతులతో చర్చిస్తున్నాం..



జాతీయ రహదారి 353బీ నిర్మాణం కోసం భూ సేకరణ విషయంలో రైతులతో చర్చిస్తున్నాం. వారితో ఒక అవగాహన కుదిరిన తర్వాత సర్వే చేస్తాం. తదుపరి ఎంత మంది రైతులకు ఎంత పరిహారం అనేది ప్రభుత్వం నుంచి గెజిట్ ద్వారా తెలియపరుస్తాం. రూ.490 కోట్లు మంజూరు కాగా, ఇందులో రోడ్డు నిర్మాణ విలువ రూ.360 కోట్లు, భూ సేకరణ, ఇతర పన్నులకు కలిపి మిగతా మొత్తం ఉంటుంది.
– సుభాష్, డీఈ, ఎన్‌హెచ్

క్లుప్తంగా

22న నవోదయ 9వ తరగతి ప్రవేశపరీక్ష

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9వ తరగతిలో ఖాళీల భర్తీ కోసం ఈనెల 22న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ చక్రపాణి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యాలయంలోని పలు ఖాళీలకు ఉమ్మడి జిల్లా నుంచి 719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని విద్యాలయం, సెంట్ క్లారిటీ స్కూళ్లలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్నవారు ఆన్‌లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలు


కూలిన ఇల్లు

తాంసి: గ్యాస్ సిలిండర్ పేలి ఇద్దరికి గాయాలయ్యాయి. మండలంలోని కప్పర్ల గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మీసాల కిషన్ సోమవారం సాయంత్రం ఇంటి వద్ద వంట గ్యాస్ మరమ్మతు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా సిలిండర్ లీకైంది. దీని తీవ్రతకు ఇల్లు కూలిపోయింది. కిషన్‌కు తీవ్రంగా, అతనితో ఉన్న ప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని గ్రామస్తులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. సిలిండర్ పేలి మంటలు సంభవిస్తే పెద్ద ఎత్తున ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) సమీపంలో ఎల్లమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయంలో చొరబడి తలుపులు పగులగొట్టారు. అమ్మవారి నగలు, హుండీని ధ్వంసం చేసి డబ్బులను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం నిర్వాహకులు ఆలయంలో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించారు. సుమారు రూ.15 వేల విలువైన వస్తువులు, నగదు చోరీకి గురైనట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అడవిపందుల దాడిలో ఒకరికి గాయాలు

ఉట్నూర్‌రూరల్: అడవి పందుల దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని నాగాపూర్‌లో ఆదివారం రాత్రి చేను నుంచి ఇంటికెళ్లే సమయంలో రైతు ఏరుకొండ తిరుపతిపై ఒక్కసారిగా అడవి పందుల దాడి చేసింది. తీవ్రగాయలైన తిరుపతిని చుట్టుపక్కలవారు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. అడవి పందుల బారి నుంచి రైతులకురక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

జన ఔషధికి..సహకారం

- ఇక గ్రామాల్లోనూ తక్కువ ధరకే మెడిసిన్
- త్వరలోనే అందుబాటులోకి..
- జిల్లాలో ఐదు సొసైటీల ఎంపిక

జిల్లాలోని మండలాలు : 18
ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు : 28
జనరిక్ మెడిసిన్ దుకాణాల ప్రతిపాదిత మండలాలు : 04



జన ఔషధి మెడికల్ షాపు కోసం ప్రతిపాదించిన తలమడుగు పీఏసీఎస్

కైలాస్‌నగర్: ఇన్నాళ్లు అన్నదాతలకు అవసరమైన సేవలనందిస్తూ వారికి అండగా నిలుస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్‌లు) తాజాగా మెడికల్ రంగంలోకి అడుగిడనున్నాయి. వాటి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన ఔషధి మెడికల్ షాపుల ఏర్పాటుకు కేంద్రం యోచిస్తోంది. తద్వారా చౌకగా లభించే జనరిక్ మెడిసిన్ గ్రామీణ ప్రాంత పేదలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు వ్యాపారపరంగా లాభాల బాటలో పయనిస్తున్న పీఏసీఎస్‌ల నుంచి ప్రతిపాదనలు స్వీకరించింది. జిల్లాలోని ఐదు సొసైటీల్లో వీటి ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. కేంద్రం ఆమోదముద్ర వేస్తే వాటి పరిధిలో విక్రయాలు త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి.

ఐదు సొసైటీల్లో ఔషధ దుకాణాలు

జిల్లాలో ప్రయోగాత్మకంగా ఐదు జనరిక్ మెడిసిన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని కేంద్రం భావిస్తోంది. వ్యవసాయ ఆధారిత సేవలను పకడ్బందీగా నిర్వహిస్తూ, ఆర్థిక పరిపుష్టి కలిగిన పీఏసీఎస్‌ల వివరాలు పంపించాల్సిందిగా కేంద్రం నుంచి రాష్ట్రసహకార కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర కమిషనర్ ఆదేశాలకనుగుణంగా జిల్లా సహకారశాఖ అధికారులు తలమడుగు, ఇచ్చోడ, నేరడిగొండ, జైనథ్, గుడిహత్నూర్ మండలాల సొసైటీలతో కూడిన ప్రతిపాదనలు పంపించారు. వీటికి కేంద్రం నుంచి అనుమతి లభించిన వెంటనే ఏర్పాటు చేసేదిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇన్నాళ్లు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన జనరిక్ మెడిసిన్ ఇకపై గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

రైతులకు వెన్నుదన్నుగా

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్) వాటి పరిధిలోని రైతులకు పంట రుణాలు అందజేస్తూ ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయి. విత్తనాలు, ఎరువులను విక్రయించడంతో పాటు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తూ అన్నదాతకు సేవలందిస్తున్నాయి. ఇలాంటి సహకార సంఘాలను మరింత బలోపేతం చేసేదిశగా కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేకంగా సహకార మంత్రిత్వశాఖ ఏర్పాటు చేసి, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు ఈ శాఖ బాధ్యతలు అప్పగించింది. ఈ శాఖకు ప్రత్యేక నిధులు సైతం కేటాయించింది. ఈ నేపథ్యంలో పీఏసీఎస్‌లను మరింత బలోపేతం చేసే దిశగా ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్న సొసైటీల సేవలను మరింత విస్తరించేలా కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగానే సొసైటీల ద్వారా జనరిక్ ఔషధాలను విక్రయించాలని నిర్ణయించింది.

జనరిక్‌పై అపోహ వద్దు



జనరిక్ మెడిసిన్ అంటే నాణ్యమైనవి కావేమోనని, వాటితో జబ్బులు తగ్గవనే అపోహ ప్రజల్లో ఉంది. ఇది వాస్తవం కాదు. పేరున్న కంపెనీల మెడిసిన్ సైతం జనరిక్‌లో తక్కువ ధరకు లభిస్తాయి. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు ఇవి ఎంతో ఉపయోగకరం. అయితే వాటిని సొంతంగా వాడకుండా వైద్యులు ప్రిస్క్రిప్షన్‌లో సూచించిన మాదిరిగా వాడితే ప్రయోజనకరంగా ఉంటుంది.

– కె.వెంకట్‌రెడ్డి, ఎండీ, ఫిజీషియన్

ప్రతిపాదనలు పంపించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఐదు సొసైటీల్లో జనరిక్ మెడిసిన్ విక్రయించే జన ఔషధి దుకాణల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతి రావాల్సి ఉంది. ఒక్కో సొసైటీ పరిధిలో 1నుంచి 3 షాపులు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆయా సొసైటీలు ఫార్మసిస్టులను నియమించుకొని మెడికల్ షాపులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దీనిపై ఇంకా స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు.

– ఎస్.శ్రీనివాస్‌రావు, జిల్లా సహకారశాఖ అధికారి

అమెరికాలో బోనాల పండుగ



కుంటాల: అమెరికాలోని కాలిఫోరియా రాష్ట్రం శాండియాగో నగరంలో ఆషాఢమాసం బోనాల పండుగను సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. తెలంగాణలోని నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, కామారెడ్డి ప్రాంత మహిళలు నెత్తిన బోనాలతో వెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. కరుణించూ తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

ఆస్పత్రుల్లో సౌకర్యాల్లేక రోగుల ఇబ్బందులు


రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌తో మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ఆస్పత్రుల్లో సరైన సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. సోమవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకోవడమే తప్పా ఎక్కడ కూడా రోగులకు అందడం లేదన్నారు. మార్చిలో మంజూరైన ఎంఆర్ఐ ఇప్పటివరకు రిమ్స్‌కు చేరుకోలేదన్నారు. సరిపడా అంబులెన్స్ లేక ప్రైవేట్‌వి ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందికి సరిపడా జీతాలు ఇవ్వడం లేదని, ఆక్సిజన్ ప్లాంట్ నిరుపయోగంగా మారిందన్నారు. కేంద్ర ప్రభుత్వం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించి ఇస్తే రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వైద్య సిబ్బందిని నియమించడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న స్పందించి ఆస్పత్రిలో సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆమె వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

21 నుంచి టీఏజీఎస్ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: హైదరాబాద్‌లో ఈనెల 21 నుంచి 24 వరకు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బైరి సోమేశ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో శిక్షణ తరగతుల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఆదివాసీ చట్టాల అమలు, భారత రాజ్యాంగం, ఆదివాసీ పోరాటాలు, గిరిజన అభివృద్ధి, వ్యవసాయం, పారిశ్రామిక రంగాలపై శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. జిల్లాలోని ఆదివాసీ యువకులు పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు ఆత్రం కిష్టన్న, కుంరం దీపక్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న వెంకట్

కైలాస్‌నగర్: గురుకుల పాఠశాలల్లో సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ ఆరోపించారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు గెస్ట్, పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు బేసిక్ పేను అమలు చేయడంతోపాటు 12 నెలల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఆర్టీల సర్వీసును రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆదివారం పండుగ సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వీక్ ఆఫ్ వర్తింపజేయాలన్నారు. నాయకులు అశోక్, స్వామి, కిష్టన్న పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్యలో అదుర్స్


సాధన చేస్తున్న క్రీడాకారులు

- రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు
- ప్రోత్సహిస్తున్న వుషూ అసోసియేషన్ సభ్యులు

భైంసాటౌన్: కరాటే, కిక్‌బాక్సింగ్, వుషూ ఆత్మరక్షణ క్రీడల్లో జిల్లా క్రీడాకారులు పట్టు సాధిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటూ సత్తా చాటుతున్నారు. జిల్లా వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు స్వచ్ఛందంగా శిక్షణ అందిస్తూ ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటికే వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన పలువురు క్రీడాకారులు నేర్చిన విద్యనే ఉపాధిగా మలుచుకోగా, మరికొందరు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు. మరికొందరు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి 19 మంది క్రీడాకారులు పతకాలు సాధించారు. అలాగే ఇటీవల జరిగిన వుషూ రాష్ట్రస్థాయి పోటీల్లో నలుగురు జాతీయస్థాయికి ఎంపికయ్యారు.


శిక్షణ అందిస్తున్న కోచ్ సాయికృష్ణ

పతకాలు సాధించాను



నేను కోచ్ శ్రీరాముల సాయికృష్ణ ఆధ్వర్యంలో కిక్‌బాక్సింగ్, కరాటే, వుషూలో శిక్షణ పొందాను. రాష్ట్రస్థాయిలో పోటీపడి మూడు సార్లు జాతీయస్థాయికి ఎంపికయ్యాను. ప్రస్తుతం మరోమారు బిహార్‌లోని పాట్నాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాను. పోటీల్లో పాల్గొని పతకాలు పొందడం గర్వంగా అనిపిస్తుంది.

– జాదవ్ కిరణ్, కుస్లి, నర్సాపూర్ మండలం

కోచ్‌గా స్థిరపడతా...



వుషూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించాను. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసపత్రం అందుకోవడం గర్వంగా ఉంది. భవిష్యత్తులో మరింతగా రాణించి కోచ్‌గా స్థిరపడాలని లక్ష్యంగా పెట్టుకున్నాను.

– రాంచరణ్, పాంగ్రి, భైంసా మండలం

కోచ్‌గా ఎదుగుతాను



భైంసాలోని కేజీబీవీలో ఇంటర్ చేశాను. ప్రస్తుతం డిగ్రీ చేస్తూనే వుషూలో శిక్షణ పొందుతున్నాను. ఇప్పటివరకు మూడు సార్లు జాతీయస్థాయిలో పోటీ పడ్డాను. ఇప్పుడు నాలుగోసారి బిహార్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటున్నాను. స్పోర్ట్స్ కోటాలో పోస్టల్ శాఖలో జీడీఎస్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో కోచ్‌గా ఎంపిక కావడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– ఆర్ స్వాతి, సిర్పెల్లితాండ, కుభీర్ మండలం

ప్రోత్సహిస్తున్నాం..



వుషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే, కిక్‌బాక్సింగ్, జూడో, తదితర క్రీడల్లో శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడి ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నాం. జిల్లా నుంచి దాదాపు వందమంది వరకు ఇప్పటివరకు పలు స్థాయిల్లో పాల్గొని పతకాలు సాధించారు.

– శ్రీరాముల సాయికృష్ణ, కోచ్, భైంసా

ప్రభుత్వ ఉద్యోగం సంపాదిస్తా..



భైంసాలోని కేజీబీవీలో చదివే సమయంలో కోచ్ శ్రీరాముల సాయికృష్ణ ఆధ్వర్యంలో కరాటే, కిక్‌బాక్సింగ్‌లో శిక్షణ పొందాను. ఇటీవల రాష్ట్రస్థాయిలో జరిగిన వుషూ పోటీల్లో పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యాను. పోలీస్ అధికారిగా ఎంపిక కావడమే లక్ష్యం.

–సోనితాయి,సేవాలాల్‌తండా,లోకేశ్వరం మండలం

రేపటి నుంచి కిసాన్ కాంగ్రెస్ రైతు యాత్ర


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నుంచి రైతు యాత్ర చేపడుతున్నట్లు కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. టీపీసీసీ పిలుపు మేరకు మావల మండల కేంద్రంలో ఈ యాత్రను ప్రారంభిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా రైతులకు రుణమాఫీ పేరిట మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో మోసం చేయడమే కాకుండా ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, పార్టీ జిల్లా నాయకులు హాజరవుతారని తెలిపారు. రైతులు, పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. పార్టీ నాయకులు కొండ గంగాధర్, ధర్మపురి చంద్రశేఖర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశువు పిండం లభ్యం

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 10వ వార్డులో సోమవారం గుర్తుతెలియని 5 నుంచి 6 నెలల శిశువు పిండం లభ్యమైంది. కుక్కలు లాక్కొని వచ్చి కాలనీలో పడేశాయని స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే స్థానికులతో పిండాన్ని దూరంగా పడవేశారు. ఎవరు పడేశారు, ఇలా ఎందుకు చేశారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేయకపోవడం గమనార్హం.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని మామిడిగూడకు చెందిన కినక పరుశురాం (23) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లారు. ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.

చెరువులో పడి మత్స్యకారుడు మృతి

పెంబి: చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మత్స్యకారుడు మృతి చెందాడు. ఎస్సై రజినీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని మందపెల్లికి చెందిన కొంద్రా నర్సయ్య (65) మత్స్యకారుడు ఆదివారం మధ్యాహ్నం చేపల వేటకు గ్రామ చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రాములు ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి


అంజి (ఫైల్)

దండేపల్లి: మండలంలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్ ఆత్రం అంజి(20) ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి సోమవారం మృతిచెందాడు. స్థానికుల కథనం ప్రకారం..రెబ్బనపల్లి శివారులోని పొలంలో కేజీవీల్స్ ట్రాక్టర్‌తో జంబు కొడుతుండగా, ప్రమాదవశాత్తు పొలంలో బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద బురదలో ఇరుక్కున్న అంజి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయమై ఎస్సై ప్రసాద్‌ను సంప్రదించగా, ఫిర్యాదు అందలేదు. మృతదేహాన్ని ప్రమాద స్థలం నుంచి లక్సెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించామని పేర్కొన్నారు.

ఇద్దరికి ప్రతిభరత్న పురస్కారాలు

శ్రీరాంపూర్: వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభ కనబర్చినవారికి హైదరాబాద్‌లో సర్వేజన సుఖి నోభవంతు సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో శ్రీరాంపూర్‌కు చెందిన ఆరుముళ్ల రాజు, జె.వెంకటేశ్‌లకు ప్రతిభరత్న పురస్కారాలు అందజేశారు. హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్రకుమార్, జాతీయ వినియోగదారుల మండలి అధ్యక్షుడు కృష్ణారెడ్డితో ఈ పురస్కారాలు అందుకున్నారు. జేసీఐ ద్వారా వ్యక్తిత్వవికాస శిక్షణ, సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టినందుకుగాను వీరికి పురస్కారాలు అందించారు. కేంద్ర నాటక అకాడమీ సభ్యురాలు భారతి, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డ్ సభ్యుడు వెంటపాటి కృష్ణాది శేషు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.